క్లుప్తంగా

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవంపై హర్షం



సత్యనారాయణను అభినందిస్తున్న సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికవడంపై చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం విశాఖలో బొత్సను కలిసి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పెద్దల సభలో సీనియర్ నేత సత్యనారాయణ తన వాణిని బలంగా వినిపించి ఈ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

122 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు వైద్యాధికారి తరణి తెలిపారు. శుక్రవారం పైడంపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎ స్.ఎస్.రాజు పాల్గొన్నారు.

మాడుగులలో వర్షం

మాడుగుల రూరల్: వారం రోజులుగా కాస్తున్న ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని తేలికపాటి వర్షం కురిసింది. ఈ వర్షానికి వాతావరణం చల్లబడింది. కొన్ని గ్రామాల్లో ఇటీవల వేసిన వరినాట్లకు లాభం చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు.

28 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు గడువు

మాకవరపాలెం: ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మూర్తి శుక్రవారం తెలిపారు. పది ఫెయిలైన వారు, మధ్యలో బడి మానేసిన వారు పదో తరగతిలో ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. వయసు 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఇంటర్‌కు 15 ఏళ్లు నిండి, పదిలో ఉత్తీర్ణత సాధించి ఉన్న వారు అర్హులన్నారు.

పీడీ పాలెంలో వైద్య శిబిరం రేపు

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో ఈ నెల 18న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వీఎస్సార్ సేవా సంస్థ అధ్యక్షుడు వడ్డి సత్యారావు తెలిపారు. గ్రామీణ ప్రజలకు సరైన వైద్య సేవలందక అవస్థలు పడుతున్నారని, కార్పొరేటు వైద్యులతో సేవలు అందించేందుకు శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రి వైద్యులు మందులు అందిస్తారన్నారు. గుండె జబ్బు, పక్షవాతం, రక్తహీనత గల గర్భిణులు, తదితరులు వైద్య సేవలు పొందాలన్నారు.

సొసైటీ సభ్య రైతుల వివరాల సేకరణ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లావాదేవీలన్నీ కంప్యూటీకరణ చేస్తున్నందున సంఘ సభ్యుల వివరాలు అందించాలని సీఈవో బంటు రామునాయుడు శుక్రవారం తెలిపారు. సంఘ సభ్యులు ఆధార్, రేషన్‌కార్డు నామినీ ఆధార్, భూమి పాసుపుస్తకం, వన్‌బీ జెరాక్స్ కాపీలను, పాస్‌ఫొటో, ఫోన్ నంబరును సంఘ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 172 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,640
రెండో రకం	3,410	4,410
మూడోరకం	3,150	3,410

వరాల తల్లికి వ్రత పూజలు



నర్సీపట్నం: ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరి దేవి

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



రోలుగుంట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మాడుగులలో వరలక్ష్మీ దేవి వ్రతంలో పాల్గొన్న సురేష్ దంపతులు



బుచ్చెయ్యపేటలో ఓ ఇంట్లో వరలక్ష్మికి సమర్పించిన నైవేద్యాలు



రోలుగుంట: భక్తులతో అలంకరించబడిన అమ్మవారు

రోలుగుంట/బుచ్చెయ్యపేట: శ్రావణమాసం పురస్కరించుకుని రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా వేకువజామునే లేచి పుణ్యస్నానాలచరించి ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించుకున్నారు. షడ్రుచులు తయారు చేసి, పలు రకాల పండ్లను నైవేద్యంగా పెట్టారు. అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. గ్రామంలో దేవాలయాలకు వెళ్లి పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తుల పేరున అభిషేకాలు చేసి వరలక్ష్మి వ్రతం చదివి వినిపించారు.

నర్సీపట్నం: పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి, పెదబొడ్డేపల్లి జ్ఞాన సరస్వతి, బలిఘట్టం దుర్గామల్లేశ్వరి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి పూజలు జరిగాయి. దుర్గామల్లేశ్వరమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ తగ్గలేదు. ఆలయంలో ప్రత్యేక వ్రతాలు జరిపించుకున్నారు. అన్ని దేవాలయాల్లో శ్రావణ సందడి నెలకొంది.

గ్రామాల్లో శ్రావణ శోభ

చోడవరం రూరల్: శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం కావడంతో గ్రామ గ్రామాన శ్రావణ శోభ వెల్లి విరిసింది. మండలంలోని అన్ని గ్రామాల్లోను గృహిణులు వరలక్ష్మి వ్రతం చేసుకోవడంలో బిజీబిజీగా గడిపారు. వారి వారి శక్త్యానుసారం అమ్మవారికి రకరకాల పిండి వంటలు, తీపి పదార్థాలతో పాటు రకరకాల పూలతో వరలక్ష్మిదేవికి అలంకరణలు చేశారు. కొందరు గృహిణులు శ్రావణలక్ష్మి అమ్మవారి రూపులను, కలశాలను స్థాపించి బంగారు కాసులను, ఆభరణాలను అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సాయం సమయంలో స్థానిక లక్ష్మమ్మవారి ఆలయం, వేంకటేశ్వర, గౌరీశ్వర, కేశవస్వామి ఆలయాలకు చేరుకుని అమ్మవారికి పూజలు జరిపించారు. ముందు రోజున చోడవరం బజారు మహిళలతో కిటకిటలాడింది. వరలక్ష్మి వ్రతాలతో గ్రామాల్లో ఇంటింటా సందడి, ఆధ్యాత్మికత వెల్లి విరిసింది.

కె.కోటపాడు: మండలంలో దేవీ ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు. ఎ.కోడూరు, పిండ్రంగి, చౌడువాడ గ్రామాల్లో దేవీ ఆలయాలతోపాటు కె.కోటపాడులో కామాక్షమ్మ ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. పిండ్రంగిలో జరిగిన పూజా కార్యక్రమాల్లో వాసిరెడ్డి సత్యనారాయణ, రమణమ్మ పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ, పోలిపిల్లమ్మ, దుర్గాలమ్మ, జంపెనలో వెలసిన వాసవీ మాత ఆలయాలకు శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

మాకవరపాలెం/నాతవరం/గొలుగొండ: వరలక్ష్మీదేవి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లోనూ మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మిదేవి వ్రతాన్ని జరుపుకున్నారు. స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొలుగొండ మండలం చీడిగుమ్మల, జోగుంపేట, ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో కనకదుర్గ ఆలయాల వద్ద అమ్మవారిని దర్శించుకున్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం వరలక్ష్మిదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు పర్యవేక్షణలో వ్రతాలు, దీపార్చన నిర్వహించారు. ఇక్కడ శివాలయంలో పార్వతీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. శ్రావణ మాసం అంతా ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు హెచ్‌బీ సత్యనారాయణమూర్తి తెలిపారు.



కె.కోటపాడు: పిండ్రంగి దేవీ ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు



నర్సీపట్నం: జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో వ్రతాలు జరిపించుకుంటున్న భక్తులు



మాడుగుల: జంపెన వాసవీ మాతను దర్శించుకున్న భక్తులు



నాతవరం: వరలక్ష్మీ దేవి పూజ నిర్వహిస్తున్న దంపతులు



నర్సీపట్నం: ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



గొలుగొండ: ఏఎల్‌పురం కనకదుర్గ ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉత్తమ సేవలకు పురస్కారాలు



హోం మంత్రి అనిత నుంచి అవార్డు తీసుకుంటున్న ప్రసాద్



ఉత్తమ లైన్‌మన్‌గా అవార్డు తీసుకుంటున్న దేవార్జున



విశాఖలో మంత్రి సత్యప్రసాద్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు



మంత్రి అచ్చెంనాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రామచంద్ర కుమార్

గొలుగొండ: స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌కు వైద్య శాఖలో జిల్లా ఉత్తమ సామాజిక సేవా అవార్డు దక్కింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం అనకాపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారుల నుంచి అవార్డు స్వీకరించారు. గొలుగొండ విద్యుత్ సెక్షన్‌లో పనిచేస్తున్న లైన్‌మన్ నాగులపల్లి దేవార్జునకు ఉత్తమ పురస్కారం దక్కింది. ఈ ప్రాంతంలో వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంతో ఆయనకు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు అవార్డు ప్రదానం చేశారు.

మాడుగుల రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని కె.జె.పురం గ్రామానికి చెందిన ఉద్యోగులు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. శ్రీకాకుళంలో శ్రీకాకుళం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పాలకుర్తి రామచంద్రకుమార్ గురువారం శ్రీకాకుళంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన గూనిపూడి నాగేశ్వరావు విశాఖ సిటీలో నర్సింహనగర్ -2 వార్డులో వార్డు వెల్ఫేర్, అభివృద్ధి కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన మంత్రి అనగాని సత్యప్రసాదు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ల నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.

పంటల నమోదుతో ప్రయోజనాలు

- చోడవరం ఏడీఏ రవీంద్రనాథ్



కాశీపురంలో పంటల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ రవీంద్రనాథ్

దేవరాపల్లి: ప్రతి రైతు బాధ్యతగా పంటల నమోదు చేసుకోవాలని చోడవరం ఏడీఏ వి. రవీంద్రనాథ్ సూచించారు. కాశీపురంలో పంటల నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. పంటల నమోదు చేస్తేనే సంక్షేమ పథకాలు వర్తింపు చేస్తామన్నారు. ఏయే సర్వే నంబర్లలో ఏ పంటలను సాగు చేసారో వివరాలను గ్రామ రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించే నిర్దిష్ట ధరకు ధాన్యం విక్రయించుకోవచ్చునన్నారు. కౌలు రైతులు, డి.పట్టా, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల భూములు కలిగిన రైతులు సైతం పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్, వీఆర్‌వో అప్పారావు, స్థానిక రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి బి.రామానాయుడు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలని నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న పీడీఎస్‌వో, స్త్రీ విముక్తి సంఘటన ప్రతినిధులు

చోడవరం రూరల్: కోల్‌కత్తాలో ఆర్.జి.కర్ ప్రభుత్వ ఆస్పత్రి జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్త్రీ విముక్తి సంఘటన, పీడీఎస్‌వో ప్రతినిధులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ నానాటికీ పని ప్రదేశాల్లోను, విద్యాలయాల్లోను మహిళలకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను కాపాడే వైద్యులను సైతం వదలక అత్యాచారాలకు, హత్యలకు పాల్పడడం అత్యంత హేయమని వాపోయారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు కావస్తున్నా దేశంలో దళితులు, మహిళలు ఇంకా నిత్య పీడనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అప్రమత్తమై సంఘటితంగా తమ జీవితాలను నానాటికీ దుర్భరం చేస్తున్న అంశాల పట్ల పోరాడితేనే తప్ప వ్యవస్థలో బతకడం కష్టతరంగా మారిందన్నారు. పట్టణంలోని చీడికాడ రోడ్డులో ఎస్సీ సంక్షేమ వసతి గృహం నుంచి పాత బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్సు, అంబేడ్కర్ విగ్రహం, కోర్టుల సముదాయం మీదుగా కొత్తూరు జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన సాగింది. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కల్పన, కుమారి, పీడీఎస్‌వో నాయకులు రాంచరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు వైద్య సేవలు బంద్

నర్సీపట్నం: కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం నర్సీపట్నంలోని అన్ని ప్రైవేటు వైద్య సేవలు నిలిపి వేస్తున్నామని ఐఎంఏ అధ్యక్షుడు మారుతీకృష్ణ, సెక్రటరీ డి.మహేశ్ తెలిపారు. ఈ నెల 9న కోల్‌కత్తాలో ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో రాత్రి డ్యూటీలో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపి వేసి ఐఎంఏ భవనంలో నిరసన చేపడుతున్నామని తెలిపారు.

భక్తులకు సంతోషిమాత మాల ధారణ



కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయం వద్ద మాలధారణ వేసిన భక్తులు

మాడుగుల రూరల్: వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయం వద్ద రెండో శ్రావణ శుక్రవారం ఉదయం 40 మంది భక్తులు మాలధారణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు సారధ్యంలో ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి శ్రీనివాసశర్మ భక్తులకు మాలలు వేశారు. వీరంతా తొమ్మిది రోజుల పాటు అత్యంత నిష్టతో దీక్షలు చేస్తారు. 2006 నుంచి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏటా వీరి సంఖ్య పెరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తొలి పూజ ఆలయ కమిటీ చైర్మన్ అమ్మతల్లినాయుడు, భక్తులు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వారు మొక్కలు నాటితే.. వీరు నరుకుతారు!



ఆర్టీ రోడ్డులో విద్యుత్ శాఖ సిబ్బంది నరికేసిన చెట్టు మొదళ్లు

బుచ్చెయ్యపేట: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే, అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అటవీ శాఖ, వన సంరక్షణ సమితి, సోషల్ ఫారెస్ట్ అధికారులు ఉపాధి హామీ పథకంలో ఏటా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. వీరి నాటిన రెండు మూడేళ్లకే విద్యుత్ శాఖ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పేరుతో విద్యుత్ తీగల కింద చెట్లను నరికేస్తున్నారు. మొక్కలు నాటినందుకు ఫారెస్ట్ అధికారులు, జంగిల్ క్లియరెన్స్ పేరుతో మొక్కలు నరికినందుకు విద్యుత్ శాఖ అధికారులు బిల్లులు చేసుకోవడంపై చూపిస్తున్న శ్రద్ధ పచ్చని మొక్కల పెంపకం ఎందుకు లేదని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెండు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



అగ్ని ప్రమాద బాధితులకు సామగ్రి అందజేస్తున్న నాసా సంస్థ మండల ప్రతినిధి శ్రీను

నాతవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నాసా స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రి అందించింది. ఎం.బెన్నవరం పంచాయతీ శివారు డొంకాడ గ్రామంలో రెండు రోజుల క్రితం బంగారు అప్పలకొండ పూరిల్లు కాలిపోయింది. సంస్థ మండల ప్రతినిధి తాటిపాక శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా అగ్ని ప్రమాద, వరద బాధితులకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాసా సంస్థ ప్రతినిధులు రామారావు, మహలక్ష్మి, అర్జున, మాజీ సర్పంచ్ అప్పారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బంగారు సూరిబాబు, ములగపూడి పాస్టరు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్త చింతామణి పద్య నాటకం



భక్త చింతామణి నాటకంలోని సన్నివేశం

మునగపాక: తిమ్మరాజుపేటలో గురువారం రాత్రి దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉత్సవంలో భాగంగా రాత్రికి ప్రదర్శించిన భక్త చింతామణి పద్య నాటకం అందరినీ ఆకట్టుకుంది. నాటకాన్ని దివంగత కాళ్లకూరి నారాయణరావు రచన చేయగా బి.వి.ఎ. నాయుడు దర్శకత్వం వహించారు.

వెంటాడుతున్న వర్షాభావం

- పంటలు రక్షించుకునేందుకు రైతుల అవస్థలు



నెర్రలు వేసిన పొలంలో డీజిల్ ఇంజిన్‌తో పెడుతున్న నీరు

బుచ్చెయ్యపేట: మండలంలో వర్షాభావం వెంటాడుతోంది. వర్షాకాలంలోనూ వాన జాడే కనిపించడం లేదు. ఈ నెలలోనే జోరు వర్షాలతో ఎక్కడ చూసినా నీటి ముంపుతో ఉండాల్సి ఉండగా, వేసవిని తలపిస్తున్న రీతిలో ఎండలు మండిపోతున్నాయి. ఈ నెలలో మండలంలో ఒక్కరోజు వర్షం కురవలేదు. ఎండలకు వరి పొలాలు బీటలు వారి నెర్రలు ఇస్తున్నాయి. బుచ్చెయ్యపేటలో ఇప్పటికి వర్షాలు లేక రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరినాట్లు పడలేదు. వరినాట్లు పడిన పొలాలికి నీరందక బీటలు వారుతున్నాయి. ఎండిపోతున్న వరి పొలాలను రక్షించుకునేందుకు రైతులు డీజిల్ ఇంజిన్లు, మోటార్లతో నీరు తోడుతున్నారు. వర్షాలు కురవకపోతే ఎర్రవాయి ప్రాంతాలైన తురకలపూడి, రాజాం, కందిపూడి, బుచ్చెయ్యపేట, మల్లాం, శివరాంపురం, భీమవరం, సీతయ్యపేట, చిట్టియ్యపాలెం తదితర గ్రామాల్లో కరువు పరిస్థితులు తప్పవని రైతులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా ఏలేరు కాలువపై వంతెన



శిథిలమైన ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన

నాతవరం: పెదగొలుగొండపేట సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏలేరు కాలువకు నిర్మించిన వంతెన శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఏలేరు కాలువతోపాటు నిర్మించిన వంతెన క్రమేపి శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనిపై రెండు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా నాతవరం మండలంలో పది పంచాయతీల ప్రజలు కోటనందూరు, రవతలపూడి మండలాలకు చెందిన పలు గ్రామాల వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వంతెనకు నిర్మించిన రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. రాత్రిళ్లు కొత్తగా వచ్చే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఏలేరు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.